వేసవిలో తాగునీటి సమస్యకు చెక్

- మున్సిపల్ అధికారుల ప్రత్యేక ప్రణాళిక
- నగరంలో కుళాయిల ద్వారా నిత్యం గంటపాటు నీటి సరఫరా



నిజామాబాద్‌నాగారం: ఎండలు మండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోరుబావుల్లో సైతం నీరు తగ్గే అవకాశాలున్నాయి. ఈక్రమంలో వేసవిలో నగర ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా మున్సిపల్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నారు. కుళాయిల ద్వారా నిత్యం నీటి సరఫరాతోపాటు, సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

అత్యవసరం ఉంటే ట్యాంకర్లు..

నగర మున్సిపల్ పరిధిలో 5 జోన్ కార్యాలయాలున్నాయి. ఒక్కో జోన్ పరిధిలో 3 ట్రాక్టర్ నీటి ట్యాంకర్లు చొప్పున మొత్తం 15 ట్యాంకర్లు అందుబాటులో ఉన్నాయి. నగరంలో ఏ ప్రాంతంలో అయినా నీటి సమస్య ఏర్పడిన, ఇక్కట్లు వచ్చినా, లీకేజీలతో నీరు రాకున్నా.. వెంటనే ట్యాంకర్ల ద్వారా ఆయా ప్రాంతాలకు నీటి సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంచారు. ముఖ్యంగా శివారు కాలనీల్లో బోరుబావులు చెడిపోతే అవసరమైనప్పుడు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తారు. శివారు కాలనీలు నాగారం, ధర్మపురిహిల్స్, పెయింటర్‌కాలనీ, డ్రైవర్స్‌కాలనీ, సాయినగర్, రోటరీనగర్, తదితర ప్రాంతాల్లో నీటి సమస్య వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు అత్యవసరంగా ప్రతిజోన్‌లో ట్యాంకర్లు సిద్ధంగా ఉంచారు. గతంలో ఒక్కో జోన్‌కు ఒక్క ట్రాక్టర్ ట్యాంకర్ మాత్రమే అందుబాటులో ఉండేది. అయితే ఇటీవలే కొత్తగా 10 వాహనాలు కొనుగోలు చేయడంతో ఇబ్బందులు తొలగిపోయాయి. హరితహారంలో నాటిన మొక్కలకు కూడా ఈ ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారానే నీరు పోస్తున్నారు. విలీన గ్రామాలైన గూపన్‌పల్లి, ముబారక్‌నగర్, మానిక్‌బండార్, ఖానాపూర్, కాలూర్, మల్లారం, తదితర గ్రామాల్లో ప్రజలకు నీటి సమస్య రాకుండా చూస్తున్నారు. ఆయా గ్రామాల్లో బోరుబావుల ద్వారా అలాగే అక్కడ ఉన్న పెద్ద ట్యాంకుల ద్వారా నీటిసరఫరా జరుగుతుంది. ఇలా వేసవిలో మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు.

నిత్యం 45 ఎంఎల్‌డీ నీటి సరఫరా..

నగరంలో 60 డివిజన్లు ఉండగా 83వేల నివాసాలు, 4లక్షల జనాభా ఉంది. అధికారికంగా సుమారు 25వేల నీటి కుళాయి కనెక్షన్లు ఉండగా, అనధికారికంగా మరో 20వేల వరకు కుళాయి కనెక్షన్లు ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ కుళాయి నుంచి ప్రతినిత్యం ఉదయం 6గంటల నుంచి 7గంటల వరకు గంటపాటు నీటి సరఫరా జరుగుతుంది. మిగత అక్కడక్కడ కాలనీల్లో బోరుబావిల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. నగరంలో నీటి సరఫరాకు సుమారు 36వరకు పెద్ద పెద్ద వాటర్ ట్యాంకులున్నాయి. ప్రతినిత్యం 45 ఎంఎల్‌డీ (4కోట్ల 50లక్షల లీటర్లు) నీరు ప్రజలకు సరఫరా జరుగుతుంది. ఇవే కాకుండా నగరంలో సుమారు 200 వరకు చేతిపంపులు ఉన్నా వీటి వినియోగం లేదు. అక్కడక్కడ పదుల సంఖ్యలో పని చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో పాటు నగరంలో సుమారుగా 400లకుపైగా బోరుబావులు ఉన్నాయి. కొన్ని కాలనీల్లో ఇప్పటికీ బోరు బావులతో నీటి సరఫరా జరుగుతుంది.

ఎలాంటి ఇబ్బందులు రావు..

నగరంలో నీటి సమస్య రాకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా లీకేజీలు ఉన్నా, నీటి సరఫరా ఆగడం లేదు. నీటి సరఫరా పూర్తికాగానే లీకేజీ సమస్య పరిష్కరిస్తున్నాం. ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రావు. అన్ని రకాలుగా అధికారులు, ఉద్యోగులను అందుబాటులో ఉంచి నీటి సరఫరా చేయిస్తున్నాం.

– మురళీమోహన్, ఇంజినీరింగ్ సెక్షన్ ఈఈ

పసుపు బోర్డుపై రాజకీయం చేయొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, కార్పొరేటర్లు

సుభాష్‌నగర్: పసుపుబోర్డు కార్యాలయం జిల్లాలో ఏర్పాటు చేయడం ఖాయమని, కాంగ్రెస్ నాయకులు పసుపు బోర్డుపై రాజకీయం చేయొద్దని బీజేపీ నిజామాబాద్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపిడి స్రవంతిరెడ్డి హితవు పలికారు. దేశవ్యాప్తంగా పసుపు రైతులకు మంచి ధర వస్తే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధాని మోదీ స్వయంగా పసుపుబోర్డు ప్రకటించారని, గెజిట్ నోటిఫికేషన్, రాష్ట్రపతి ఉత్తర్వులు కూడా ఇచ్చారని గుర్తుచేశారు. ఈవిషయంలో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలతో పాటు పసుపు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి జిల్లాకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జగిత్యాల్‌ను పీఎఫ్‌ఐ, రోహింగ్యాలకు అడ్డాగా మార్చారని ఆరోపించారు. చెరుకు ఫ్యాక్టరీలు మూత పడటానికి కాంగ్రెస్, జీవన్‌రెడ్డి కారణమన్నారు. సీఏఏ, ఎన్‌ఆర్‌సీని ఎందుకు వ్యతిరేకిస్తున్నారని, కేవలం ముస్లింల ఓట్ల కోసమేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు, జీవన్‌రెడ్డికి వయస్సు అయిపోయిందని, విశ్రాంతి తీసుకోవాలని హితవుపలికారు. కార్పొరేటర్లు పంచరెడ్డి ప్రవళిక, ఆకుల హేమలత శ్రీనివాస్, ఇప్పకాయల సుమిత్రదేవి కిషోర్, చందుపట్ల వనిత, పంచరెడ్డి లావణ్య, ఎర్రం సుధీర్, మెట్టు విజయ్ ఉన్నారు.

రూరల్ మండలంలో 98 శాతం పన్ను వసూలు


ఇంటి పన్నులు వసూలు చేస్తున్న ఎంపీవో మధురిమ, కార్యదర్శులు (ఫైల్)

నిజామాబాద్ రూరల్: మండలంలోని 19 గ్రామాలో 98 శాతం పన్నులు వసూలు అయినట్లు ఎంపీవో మధురిమ గురువారం తెలిపారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన ఉన్నప్పటికీ గ్రామాల అభివృద్ధి కోసం పంచాయతీ స్పెషల్ అధికారులు, కార్యదర్శులు, ఎంపీడీవో అధికారులు కలిసి రెండు టీంలుగా ఏర్పడి గత నెల మొత్తం స్పెషల్ డ్రైవ్ నిర్వహించడంతో పన్నులు భారీగా వసూలైనట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు కావలసిన మౌలిక వసతుల కల్పనకు ప్రతి ఒక్కరు ఇంటి పన్నును చెల్లించాలని పేర్కొన్నారు. ముత్తకుంట, ఆకుల కొండూర్, గండారాం, ధర్మారం (ఎం)ధర్మారం తండాల్లో వందశాతం ఇంటిపన్నులు అధికారులు వసులు చేశారు. అదేవిధంగా అతి తక్కువగా రాంనగర్ గ్రామంలో పన్నుల వసూలు అయినట్లు తెలిపారు.ఇప్పడి వరకు రూరల్‌లోని 19 గ్రామాల్లో రూ.76,41,765 పన్నులు వసూలు కాగా రూ.9,03,535 పన్నులు రావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టులో నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఇటీవల ఏర్పాటుచేసిన జిజ్ఞాస పోటీల్లో నిజామాబాద్ జిల్లాలో అస్తిత్వం కోల్పోయిన చందు కళారూపం-ఒక పరిశీలన అనే అంశంపై విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. ఈసందర్భంగా అధ్యాపకులు విద్యార్థినులను అభినందించారు.

సంక్షిప్తం

డీఐఈవోకు సన్మానం



నిజామాబాద్‌అర్బన్: జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌ను గురువారం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్ నాయకులు సన్మానించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటి రవి, రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రెటరీ వినోద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పరశురాములు, రానా, శ్రీనివాస్, తిరుపతి, జయ, నందు ఉన్నారు.

ఎన్‌సీసీ వేసవి శిబిరం

నిజామాబాద్‌రూరల్: నగరంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలోని ఎన్‌సీసీ యూనిట్-1, 2లు గురువారం వేసవి కాల ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. ఈసందర్భంగా ముబారక్‌నగర్, కేశాపూర్‌లో ప్రోగ్రాం అధికారులు రవీంద్రరావు, సుజాత గ్రామ ప్రజలకు ఓటు విలువను తెలియజేసి ప్రజలను చైతన్యపరిచారు. ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, ఎన్‌సీసీ చైర్మన్ సుజన్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ అనిల్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



అనాథ శవానికి అంత్యక్రియలు



డిచ్‌పల్లి: మండల కేంద్రం సమీపంలోని 44వ నెంబరు జాతీయ రహదారి పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. దీంతో డిచ్‌పల్లి ఎస్సై మహేష్ ఈ విషయాన్ని నడిపల్లి జీపీ ప్రత్యేకాధికారి శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి నిట్టు కిషన్‌రావుకు సమాచారం అందించారు. వారు స్పందించి పంచాయతీ ఆధ్వర్యంలో అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఐపీఈతో గిరిరాజ్ కళాశాల ఒప్పందం



నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ కళాశాలలోని వాణిజ్య శాస్త్ర విభాగం గురువారం హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (ఐపీఈ)తో ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా కళాశాల విద్యార్థులకు అధ్యాపకులకు పరిశోధనకు సంబంధించి సెలబస్‌లో మార్పులు చేర్పులు, ఇంటర్న్‌షిప్‌కు అవకాశం ఉంటుందని ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ లింగన్న, ఐపీఈ ప్రతినిధులు శ్రీనివాసమూర్తి రామకృష్ణ ఉన్నారు.

ఓటుహక్కు విలువైనది



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని ఎస్సై గంగాధర్ తెలిపారు. మండలంలోని సిర్‌పూర్ గ్రామంలో గురువారం రాత్రి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. విక్రమ్ బృందం ఓటు హక్కు, సైబర్ నేరాలు, షీ టీం, తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు నాటకాన్ని ప్రదర్శించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

మున్సిపల్ వాహనాలకు డీజిల్ కోత

- తక్కువ పోయడంతో వాహనాల డ్రైవర్ల ఆందోళన

నిజామాబాద్‌నాగారం: మున్సిపల్ వాహనాలకు డీజిల్ ఇవ్వడంలో అధికారులు కోత విధించడంతో డ్రైవర్లు గురువారం ఆందోళన చేపట్టారు. ఒక్కో వాహనానికి 5లీటర్ల డీజిల్ ఇస్తున్నామని లెక్కలు చెబుతున్నా.. కేవలం 3లీటర్ల డీజిల్ ఇస్తున్నారని వాహనాల డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజులుగా కేవలం 3లీటర్ల డీజిల్ ఇవ్వడంతో డ్రైవర్లు వాహనాలు తీయమంటు నిరసనకు దిగడంతో విషయం బయటకు వచ్చింది.

బిల్లు ఆలస్యంతో డీజిల్‌కు బ్రేక్

నగరంలో ఆరు జోన్ ఉండగా ఒక్కో జోన్ పరిధిలో టాటా మినీ వాహనాలు, ట్రాక్టర్లు, టిప్పర్‌లు కలుపుకొని 20 వరకు ఉన్నాయి. ప్రతినెల నగరంలోని ఇంద్రపూర్ పెట్రోల్‌బంక్‌లోనే చెత్త వాహనాలకు డీజిల్ పోస్తారు. అయితే రూ. 60లక్షల బిల్లు రాకపోవడంతో బంకు నిర్వాహకులు డీజిల్ పోయలేదు. దీంతో ఈ నెల 1నుంచి 4వరకు ఆయా జోన్‌ల పరిధిలో ఉన్న శానిటేషన్ అధికారులే వాహనాల్లో డీజిల్ పోయించారు. వాస్తవానికి టాటా మినీ వాహనాలకు ప్రతినిత్యం 5లీటర్ల డీజిల్ పోయాల్సి ఉండగా కేవలం 3లీటర్లే పోయించారని ఇలాగైతే చెత్తను నగరం నుంచి డంపింగ్‌యార్డుకు ఏవిధంగా తరలించాలని డ్రైవర్లు ఆందోళన చెందారు. అలాగే టిప్పర్‌కు 8లీటర్ల డీజిల్ పోయాల్సి ఉండగా, 6లీటర్లు, ట్రాక్టర్‌కు 7లీటర్లు పోయాల్సి ఉండగా, 5లీటర్లు పోశారు. దీంతో చెత్త తరలింపు విషయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, రోజుకు మూడు ట్రిప్పులు కొట్టాల్సి ఉండగా కేవలం రెండు ట్రిప్పులు మాత్రమే కొట్టుతున్నామని డ్రైవర్లు చెబుతున్నారు. దీంతో డ్రైవర్లు ఆందోళన చేపట్టడంతో సంబంధిత అధికారి వచ్చి సర్దిచెప్పడంతో వారు వాహనాలు తీసుకొని చెత్త తరలింపునకు వెళ్లారు.

చెక్కు పాస్ కాలేదు..

నగరంలో చెత్త సేకరణలో ఇబ్బందులు రాకుండా చూడాలని ఆయా జోన్‌లకు సంబంధించిన అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. డీజిల్ బిల్లుకు సంబంధించి రూ. 60లక్షల చెక్కు పాస్ కాలేదు. వాహనాల్లో ఎంత డీజిల్ పోయించారో నాకు తెలియదు. దీనిపై పూర్తిగా తెలుసుకుంటా.

– సాజిత్‌అలీ, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో

క్లుప్తంగా

దేశభక్తిని అలవర్చుకోవాలి



తెయూ(డిచ్‌పల్లి): జాతీయవాద స్ఫూర్తితో ప్రతి విద్యార్థి దేశభక్తిని అలవర్చుకోవాలని ప్రధాన వక్త నర్రా వెంకట శివకుమార్ జీ పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) తెలంగాణ యూనివర్సిటీ శాఖ అధ్వర్యంలో గురువారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా ఆయన పాల్గొని మాట్లాడారు. యువత మత్తు పదార్థాలు విడనాడి, స్వామి వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. యువత సన్మార్గంలో నడిచేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తుందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌గుప్తా, ఖండ కార్యవాహ భూషణ్ జీ, జిల్లా సహా వ్యవస్థ ప్రముఖ్ గంగారెడ్డి, సాయికుమార్, శ్రవణ్, చందు, సంతోష్ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద గల రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జగదాంబ, సేవాలాల్ ఆలయ ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆవిష్కరించారు. రూరల్ మండంలోని మల్కాపూర్ తండాలోగల జగదాంబ, శ్రీసేవాలాల్ మహరాజ్ , శ్రీరామారావు మహరాజ్ మందిరం వార్షికోత్సవం ఈ నెల 7నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చెర్మన్ మున్నినాయక్ తెలిపారు. 9న ఆలయ ప్రాంగణంలో భోగ్ బండార్ నిర్వహించి అన్నదానం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తదితరులు హాజరు కానున్నట్లు వివరించారు. తండా పెద్దలు, సదర్ నాయక్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చూడాలి



నిజామాబాద్ రూరల్: వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని ఎంపీడీవో మల్లేష్ అధికారులను ఆదేశించారు. మండలంలోని శాస్త్రినగర్, రాంనగర్ గ్రామాల్లో గురువారం ఎంపీడీవో పర్యటించారు. గ్రామానికి సంబంధించిన కార్యదర్శిలు, వాటర్ మ్యాన్‌లు, పంచాయతీ కార్మికులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకపోయిన సమయానుకులంగా తాగు నీటిని ప్రజలకు అందిచాలని అన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రజలకు కావలసిన మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించాలని ఆదేశించారు. ఎంపీవో మధురిమ, ఆయా గ్రామల కార్యదర్శులు పాల్గొన్నారు.

5 ఫిర్యాదుల పరిష్కారం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని తానాకుర్ది సబ్‌స్టేషన్ ఆవరణలో గురువారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికకు 5 ఫిర్యాదులు అందగా, అక్కడే పరిష్కరించినట్లు డీఈ ఉత్తమ్ జాడే తెలిపారు. మోపాల్, బర్దిపూర్, నిజామాబాద్ రూరల్, జక్రాన్‌పల్లి, సారంగాపూర్, పడకల్ సెక్షన్ల పరిధిలోని వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం వేదికను ఏర్పాటుచేశామని డీఈ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా చైర్‌పర్సన్ రామకృష్ణ, మెంబర్ ఫైనాన్స్ కిషన్, రాజాగౌడ్ హాజరై, ఫిర్యాదులను స్వీకరించారు. ఏడీఈ బాలేష్, ఏఈ బాబా శ్రీనివాస్, ఇతర మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కంజర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సైబర్ నేరాల భద్రతపై పెట్టుబడి వేదిక (ఇన్వేస్టిచర్ సెరిమోని) కార్యక్రమంలో భాగంగా గురువారం సైబర్ అంబాసిడర్ విద్యార్థులకు బ్యాడ్జీలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అంతకుముందు మెంటర్ టీచర్ రాజేందర్ విద్యార్థులతో సైబర్ భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. వ్యక్తిగత వివరాలు ఎవరికి తెలియజేయకూడదని, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఎవరికి షేర్ చేయకూడదని, సోషల్ మీడియాను సక్రమ పద్ధతిలో వాడాలని మెంటర్ టీచర్ సూచించారు. హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ మాట్లాడుతూ సైబర్ క్రైం జరిగినప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటలక్ష్మీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నేటి చిత్రం..



డ్రెయినేజీని శుభ్రం చేయరూ..!

నగరంలోని మహిళా పోలీస్‌స్టేషన్ ఎదుట డ్రెయినేజీలో నీటి పారకం నిలిచిపోవడంతో నిండిపోయింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రోడ్డు పక్కనే డ్రెయినేజీ ఉండడంతో వాహనదారులు రాత్రివేళలో ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయని స్థానికులు తెలుపుతున్నారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయినేజీని శుభ్రం చేసి, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

దళారులను నమ్మి మోసపోవద్దు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎఫ్‌పీవో చైర్మన్ మహిపాల్ యాదవ్

ధర్పల్లి: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎఫ్‌పీవో చైర్మన్ మహిపాల్ యాదవ్ అన్నారు. మండలంలోని దుబ్బాక గ్రామంలో గురువారం ధర్పల్లి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రైతు లాభాల బాటలో నడవాలనే ఎఫ్‌పీవో సంస్థను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంటకు రూ.500 బోనస్‌ను వెంటనే అమలు చేయాలని అన్నారు. రైతులందరూ ఒక గ్రూప్‌గా ఏర్పడి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించుకున్నట్లు తెలిపారు. సీఈవో సుజాత, కోశాధికారి కోతి శేఖర్‌రెడ్డి, పెంటన్న, బాల్‌రెడ్డి, చిన్న గంగారాం, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం ఎన్నిక

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) ఎన్నికలు గురువారం నిర్వహించారు. టూటా నూతన అధ్యక్షుడిగా పున్నయ్య, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణరెడ్డి, రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా మోహన్‌బాబు, సహాయ కార్యదర్శులుగా బాలకిషన్, నీలిమ, కోశాధికారిగా నాగరాజు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా వివేక్, అశోక్‌వర్ధన్‌రెడ్డి, ఎన్నికల పరిశీలకులుగా కిరణ్మయి వ్యవహరించారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతనంగా ఎన్నికైన టూటా ప్రతినిధులు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులను ఆయన అభినందించి, వర్సిటీ అభివృద్ధిలో సహాయ, సహకారాలు అందించాలని సూచించారు.

గోశాలకు గడ్డి అందజేత



నిజామాబాద్‌సిటీ: గోకుల్ గోసేవ సమితి ఆధ్వర్యంలో గురువారం సద్గురు ధామం దత్త మందిర్ గోశాలలో ఒక గడ్డి ట్రాక్టర్ 80 కట్టలు అందజేశారు. సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	70,900	వెండి (కిలో)	82,000
22 క్యారెట్స్	65,397		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	30	50
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	40	60
జీరకాయ	30	50	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	16	30
జిర్నిసుకాయ	30	60	గోజగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	30	50
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్స్‌డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు) - 10.25, 1.30, 4.35, 7.40, 10.45
స్క్రీన్-2	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.45, 1.40, 4.40, 10.30, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (తెలుగు) 7.45
స్క్రీన్-3	భరత నాట్యం (తెలుగు) - 1.40, టిల్లు స్క్వేర్ (తెలుగు) - 7.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు) - 11.45, 3.10, 6.35, 10.00
స్క్రీన్-2	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-తెలుగు) - 11.20, 2.00, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-ఇంగ్లీష్) - 4.40, 7.20, 10.00
స్క్రీన్-3	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.30, 1.30, 7.40, 10.40, భరత నాట్యం (తెలుగు) - 4.55
స్క్రీన్-4	క్రూ (తెలుగు) - 10.30, 1.20, 7.35, ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు) - 4.10, భరత నాట్యం (తెలుగు) - 10.25
దేవి	టిల్లు స్క్వేర్ (తెలుగు)
నటరాజ్	భరత నాట్యం (తెలుగు)
లలితామహల్	ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు)
విజయ్	రజాకార్ (తెలుగు)